క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

ఆంజనేయునికి సింధూరాలంకరణ



ముత్తుకూరు : ముత్తుకూరులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం వాయుపుత్రుడు సింధూర అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీపాల తోరణాలతో శోభాయమానంగా అలంకరించిన ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక శాలివాహన సంఘం ఉభయకర్తగా వ్యవహరించింది.

బీసీజీ వ్యాక్సినేషన్‌కు అనూహ్య స్పందన

• వైద్యాధికారి రామకృష్ణ

కొడవలూరు : పెద్దల బీసీజీ వ్యాక్సినేషన్‌కు అనూహ్య స్పందన లభిస్తోందని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఆలూరుపాడులో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారు టీబీ బారిన పడుతున్న నేపథ్యంలో పెద్దల బీసీజీ వ్యాక్సిన్ కల్పతరువులా అందుబాటులోకి వచ్చిందన్నారు. ఏ గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టినా పెద్దలు అనూహ్యంగా సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. 18 ఏళ్లు నిండని వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ వ్యాక్సిన్ వేయించుకోరాదన్నారు. క్షయ వ్యాధికి మందులు వాడుతున్న వారు కూడా వ్యాక్సిన్ వేయించుకోవద్దని సూచించారు. రక్తదానం చేసిన వారు మూడు నెలలు వరకు, కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకుని మందులు వాడుతున్న వారు ఎట్టి పరిస్థితుల్లో బీసీజీ వేయించుకోవద్దని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఏ వెంకట్రావు, ఏఎన్‌ఎం నదియ, ఆశా కార్యకర్త పద్మ పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

వెంకటాచలం : అదాని ఫౌండేషన్, అదాని విల్మార్ ఆధ్వర్యంలో సుపోషణ్ ప్రాజెక్ట్ సహకారంతో మండలంలోని తిక్కవరప్పాడులో గురువారం మొక్కలను పంపిణీ చేశారు. నిమ్మ, బొప్పాయి, మునగలతో పాటుగా 26 రకాల కూరగాయల విత్తనాలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారిణి కొంగి మాతమ్మ మాట్లాడుతూ ఇంటి వద్దనే కూరగాయలను పండించుకుంటే నాణ్యమైన ఆహారం తీసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించేందుకు ప్రతిఒక్కరికీ కూరగాయల విత్తనాలతో పాటు, మొక్కలు పంపిణీ చేసి వాటి ఉపయోగాలను వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుపోషణ్ ప్రాజెక్ట్ సభ్యులు శోభ, కృష్ణవేణి, అరుణ, రేవతి, సుమతి, చందన, వనిత, భూమిక తదితరులు పాల్గొన్నారు.



పార్కు ప్రధాన ద్వారం



చిల్డ్రన్స్‌పార్కు వ్యూ



భారీ చెస్ బోర్డు

ఆనందం ఆహ్లాదం

నిత్యం పనిభారం, మానసిక ఒత్తిడి నడుమ నగర వాసి జీవనం అలసిపోతోంది. దీంతో కాసేపు ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు ఆహ్లాదకర వేదికగా మారింది నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు. స్థానిక ముత్తుకూరు రోడ్డు కూడలి నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఉన్న పార్కు పిల్లలు, పెద్దలను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

- ప్రకృతి సౌందర్యాలకు నెలవు.. నెల్లూరు చిల్డ్రన్స్‌పార్కు
- చిన్నారుల కోసం ఆటల సామగ్రి
- సంతోషంగా సేదతీరుతున్న నగర ప్రజలు

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరానికి చిల్డ్రన్స్‌పార్కు ప్రకృతి మణిహారంగా ఉంది. సరికొత్త హంగులతో, పచ్చదనం మధ్య నగర నడిబొడ్డున దాదాపు ఆరు ఎకరాల విస్తీర్ణంలో బ్యూటిఫుల్ గ్రీన్ స్పేసెస్ పేరిట చిల్డ్రన్స్ పార్కు రూపుదిద్దుకుంది.

పార్కులోని వసతులు

పిల్లలు ఆడుకునేందుకు, వారి మేధాశక్తి పెంచుకునేందుకు ఓపెన్ మోడల్ చెస్‌బోర్డును ఏర్పాటు చేశారు. కనుల విందు చేసే వాటర్ ఫౌంటైన్, లైటింగ్, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్‌పూల్, యోగా సెంటర్, అవుట్ డోర్ స్కేటింగ్ రింగ్, జిమ్ చేసుకునేందుకు మహిళలకు, పురుషులకు వేర్వేరుగా, పర్యావరణ సంరక్షణకు ఆన్‌సైట్ కంపోస్టింగ్, ప్రజలందరికీ పర్యావరణ ప్రాముఖ్యతను తెలియజేయడానికి బయో డైవర్సిటీ మ్యూజియం, ఆత్మరక్షణ కోసం కర్రసాము, మార్షల్ ఆర్ట్స్.. ప్రకృతి అందాలను తిలకించేందుకు గుడ్‌క్వాలిటీ సీటింగ్, పిల్లల కోసం ట్రాంపోలిన్, చెత్త ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా లిట్టర్ బీన్స్, ప్లే ఎక్విప్‌మెంట్, పార్కింగ్ సౌకర్యం, ఇలా ఎంతో అందంగా ఆహ్లాదకరంగా ఉన్న చిల్డ్రన్స్‌పార్కు ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. అంతేకాకుండా మరో రూ.2 కోట్లు ఖర్చు చేసి మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కార్పొరేషన్ అధికారులు త్వరలో పనులు చేపట్టనున్నారు.

సెలవుల సందడి

ఆహ్లాదాన్ని అందించే చిల్డ్రన్స్‌పార్కులో ప్రస్తుతం సెలవుల సందడి కనిపిస్తోంది. రోజూ వందలాది మంది ఇక్కడ సేద తీరుతున్నారు. పండుగ, వీకెండ్‌లలో రద్దీ మరింత రెట్టింపు అవుతుంది. ఉదయం పార్కు సమీప ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు వాకింగ్‌కు వస్తున్నారు.

వేసవి సెలవులు కావడంతో పిల్లలతో కలిసి కుటుంబ సభ్యులు పార్కులో గడపడానికి మక్కువ చూపుతున్నారు. వారాంతరాల్లో బంధువులు, స్నేహితులతో కలిసి ఆనందంగా వచ్చి ఇక్కడ సమయం కేటాయిస్తున్నారు. పిల్లలు ఆట వస్తువులతో ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.



వాకింగ్ చేస్తున్న పెద్దలు



ఉయ్యాల ఊగుతున్న చిన్నారులు



వ్యాయామం చేస్తూ..

పార్కును మరింత అభివృద్ధి చేస్తాం



చిల్డ్రన్స్ పార్కులో మరిన్ని మౌలిక వసతులు కల్పించనున్నాం. ఇందుకోసం రూ.2 కోట్లు ఖర్చు చేయనున్నాం. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిపివేశాం. తాగునీటి వసతి, పబ్లిక్ టాయిలెట్స్ తదితర పనులను త్వరలోనే ప్రారంభించి పార్కును మరింత అభివృద్ధి చేస్తాం.

– సంపత్‌కుమార్, ఎస్‌ఈ, నగరపాలక సంస్థ

నగరానికే తలమానికం



సెలవు రోజుల్లో, సాయంత్రం వేళల్లో సేద తీరేందుకు ప్రజలకు అవసరమైన చిల్డ్రన్స్‌పార్కు అందుబాటులో ఉండడం సంతోషకరం. అంతేకాకుండా చిల్డ్రన్స్‌పార్కు నగరానికే తలమానికం. కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడి పార్కుకు వచ్చి సేదతీరుతూ కాలక్షేపం గడపడం ప్రజలకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది.

– కిషన్‌రెడ్డి, నజీర్‌తోట, నెల్లూరు నగరం

అందరికీ ఉపయోగకరం



నగరపాలక సంస్థ పరిధిలో ప్రకృతి సౌందర్యాల నడుమ అందమైన చిల్డ్రన్స్‌పార్కు ఉండడం చాలా సంతోషకరం. ఇది నగర ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంది. సమయం దొరికినప్పుడల్లా కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడకు వచ్చి సంతోషంగా గడుపుతూ సేద తీరుతుంటాం.

– యశ్వంత్‌సింగ్, నారాయణరావుపేట, నెల్లూరు నగరం



కేరింతలు కొడుతున్న చిన్నారులు



పార్కులో పచ్చదనం



స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని డీసీఓ గుర్రప్ప తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని జిల్లా సహకారశాఖ అధికారి(డీసీఓ) కార్యాలయ ప్రాంగణంలో సహకారశాఖ సిబ్బంది గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ 'మన భూమి మన భవిష్యత్తు, పునరుద్ధరణ వారసులుగా మనం' అనే నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకునే చర్యలు చేపట్టాలని కోరారు. ఇందులో భాగంగా తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పడుగుపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి, డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు లత, ఉష, ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రసూల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డీసీఓ, కార్యాలయ సిబ్బంది

మైపాడు గేట్ సెంటర్‌లో అన్నదానం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని మైపాడు గేట్ సెంటర్‌లో అమావాస్యను పురస్కరించుకుని అమ్మ భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పితృదేవతల ఆత్మశాంతి కోసం నెల్లూరు అమ్మ భగవాన్ శిష్యులు అక్షజ్ దాసాజీ, సౌజన్య దాసాజీ సూచనల మేరకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గత నెల రోజులుగా వేసవిలో దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేసినట్లు రమణయ్య, కిశోర్, భారతి, శిరీష, ధనలక్ష్మి తెలిపారు. అలాగే పేదల కోసం రూ.10కి భోజనం అందించడంతో పాటు స్వచ్ఛ భారత్, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించినట్లు వివరించారు.



వేదగిరిలో విశేష పూజలు



స్వామివారికి పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లూరు సిటీ : నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం అనంతరం 16 రోజుల పండగ సందర్భంగా మూలమూర్తులకు అభిషేకం, ద్వాదశరాధన, ఏకాంత సేవ, విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు. ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉభయకర్తలుగా నెల్లూరు నగరానికి చెందిన సుబ్బు నరసింహం కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఈఓ వి.గిరికృష్ణ, అర్చక సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

రామానాయుడికి ఘన నివాళి

నెల్లూరు(బృందావనం) : స్థానిక విజయమహల్ గేట్ సెంటర్ వద్ద సితార కార్యాలయంలో దర్శక నిర్మాత డి.రామానాయుడు జయంతిని గురువారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు డివిజన్ కో–ఆర్డినేటర్ కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో రామానాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, జయకుమార్, దువ్వూరు బెనర్జీ, శివకుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మర్యాదపూర్వకంగా..



చంద్రబాబుతో కోటంరెడ్డి సోదరులు

నెల్లూరు సిటీ : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నారా లోకేశ్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

• నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

నారాయణను కలిసిన పలువురు

నగర ఎమ్మెల్యే డాక్టర్ పొంగూరు నారాయణను నగరంలోని ఆయన నివాసంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

• చిరుజల్లులతో ఉపశమనం





నెల్లూరు(బారకాసు) : వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగేలా వాతావరణం మారింది. ఉపరితల ఆవర్తనంతో గురువారం వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆకాశంలో మేఘావృతమైంది.

కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. మరోవైపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న తరుణంలో వాతావరణం చల్లబడడంతో నగర ప్రజలు, వృద్ధులు, మహిళలు సేదతీరగా, చిన్నారులు సరదాగా గడిపారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడా శిక్షణ పొందుతున్న 450 మంది క్రీడాకారులకు గురువారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు తెలిపారు. కె.విజయభాస్కర్ రెడ్డి సౌజన్యంతో వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ గిరినాయుడు, అసోసియేషన్ నిర్వాహకులు ఎస్.రమేష్‌బాబు, కె.జయదేవ్, ఎం.నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

